క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జంగాకు స్వాగతం



జంగాను మర్యాదపూర్వకంగా కలిసిన మన్యాల తదితరులు

దాబాగార్డెన్స్ : శాసన మండలి సభ్యుడు, ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తికి బీసీ విభాగం విశాఖ జిల్లా ఘన స్వాగతం పలికింది. విశాఖ విచ్చేసిన ఆయనను పార్టీ బీసీ విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, సత్యాల సాగరిక వెంకట్, రామిశెట్టి కిరణ్, ఉమామహేష్, సునీల్, సాయి సంతోష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

విజిబుల్ పోలీసింగ్



విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు జనతాబజార్ వద్ద లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు రేవతమ్మ, తులసీదాస్ ఆధ్వర్యంలో ఎస్సైలు భాస్కరరావు, హరికృష్ణ రహదారి భద్రతా చర్యలు చేపట్టారు. అనంతరం రోడ్డు పక్కన అనధికారకంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ రహదారిని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రయాణికులకు అడ్డం లేకుండా రహదారి క్లియర్‌గా ఉండాలన్నారు. పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు.

అలరించిన భజనలు.. కీర్తనలు



సత్యదేవుని సన్నిధిలో కోలాటం, కీర్తనల బృందాలు

దాబాగార్డెన్స్ : ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో కోలాటాలు, కీర్తనలు నిర్వహించారు. తగరపువలసకు చెందిన సింహాద్రి సేవా సంఘం ప్రతినిధి ఎస్. హరిలక్ష్మి, గాజువాకకు చెందిన శ్రీతలుపులమ్మ తల్లి కోలాటం ప్రతినిధి రాజేశ్వరి, శంకరమఠం శ్రీయోగ చైతన్య కోలాటం బృందం ప్రతినిధి శేష్మ, కంచరపాలెం శ్రీలక్ష్మీ నరసింహ కోలాటం బృందం ప్రతినిధి సత్య, మల్కాపురం వాసుదేవ అన్నమయ్య సంకీర్తన ప్రతినిధి గుణవతి, వారాహి కోలాటం ప్రతినిధి పి. పార్వతి పలువురు మహిళా భక్త బృందం సభ్యులచే నిర్వహించిన కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మరో రెండు రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో బుద్ధ మహలక్ష్మీ నగేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అందంగా.. ఆహ్లాదంగా



న్యూ మార్కెట్ స్ట్రీట్ పాఠశాలకు అమరిన వెస్ట్రన్ స్టైల్ మరుగుదొడ్లు

- అదనపు వసతులతో ప్రభుత్వ పాఠశాలలకు నూతన హంగులు
- రూ.2 కోట్లతో కొత్త తరగతి గదులు, టైల్స్, కిచెన్, విద్యుత్, డైనింగ్ హాళ్ల ఏర్పాటు



గణేశ్వర పాఠశాలలో పూర్తయిన అదనపు తరగతి గదులు

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. నాడు దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వడంతో ఈరోజు ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు దేశ, విదేశాల్లో డాక్టర్లుగా, ఇంజినీర్లుగా విధులు నిర్వర్తిస్తూ గొప్ప స్థాయికి చేరుకున్నారు. అలాగే ఇప్పుడు జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో విద్యకు ఎంతో ప్రాధాన్యత కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి డిగ్రీ కళాశాలల వరకు అన్ని విద్యా నిలయాలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. గతంలో ఉండే పాఠశాలలకు కొత్తరూపు ఇవ్వడంతో పాటు అదనపు తరగతి గదులు, వంటశాలలు (కిచెన్), మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటివి కల్పిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను చూస్తే ప్రైవేట్ విద్యా సంస్థలను మించి తీర్చిదిద్దుతున్న సంగతి అర్థమవుతుంది.

రూ. 2 కోట్లతో అదనపు వసతులు..

జీవీఎంసీ 35వ వార్డులోని న్యూమార్కెట్ స్కూల్, మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న మరో పాఠశాల ఆధునికీకరణకు రూ. 2 కోట్లు వెచ్చించి అదనపు తరగతి గదులు, టైల్స్, మరుగుదొడ్లు, కిచెన్, డైనింగ్ హాల్స్, విద్యుత్, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం మొక్కలు నాటి పాఠశాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. జీవీఎంసీ సిటీ స్కూల్ పేరుతో ఇచ్చిన నిధులను పాఠశాలలకు ఉపయోగించి అభివృద్ధి చేస్తున్నారు. దీని వలన పాతనగరంలో ప్రజలందరూ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించలేదన్న బాధ లేకుండాపోయింది. విద్యార్థులకు జగనన్న పుస్తకాలు, బ్యాగ్‌లు, షూ వంటివి అందజేస్తుండడంతో తల్లిదండ్రులు ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపడంలేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

పాఠశాలలు బాగున్నాయి..



ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. గతంలో మా పిల్లల్ని ప్రభుత్వ బడికి పంపించేవాళ్లం కాదు. ఇప్పుడు అవే చూడడానికి చాలా బాగున్నాయి. చదువు కూడా బాగా చెబుతున్నారు. జగనన్న పిల్లలకి యూనిఫారం, బూట్లు, పుస్తకాలు, సాక్సులు ఇస్తూ వారిని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.

– సత్యనారాయణరాజు, జీవీఎంసీ 35వ వార్డు

రూపాయి ఖర్చు లేదు..



ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలల కన్నా గొప్పగా తీర్చిదిద్దడంతో పాటు పిల్లలకు కావల్సిన వసతులు జగనన్న ఇస్తున్నారు. వారి చదువులకు ఒక్క రూపాయి ఖర్చు చేయనవసరం లేదు. ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు.

–లావణ్య, విద్యార్థి తల్లి, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి..



ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న ఆశయంతోనే ముఖ్యమంత్రి జగనన్న విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకొచ్చారు. పేదరికంతో ఎవరూ బడి బయట ఉండకూడదు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించుకోలేకపోయాం అనే భావన లేకుండా జగనన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అత్యద్భుంగా తీర్చిదిద్దుతున్నారు.

–విల్లూరి భాస్కరరావు, కార్పొరేటర్, జీవీఎంసీ 35వవార్డు

రోడ్డు విస్తరణతో నష్టపోతాం



కార్పొరేటర్ సాధిక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

జగదాంబ : వన్‌టౌన్ రోడ్డు విస్తరణతో తీవ్రంగా నష్టపోతామని 39వ వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీడింగ్ రూమ్ నుంచి కంచరవీధి వరకు అతిపురాతనమైన దేవస్థానాలు, చర్చిలు, మశీదులు వున్నాయని తెలిపారు. ప్రస్తుతం 30 నుంచి 40 అడుగుల మేర విస్తరించి ఉన్న రోడ్డును విస్తరించాలని మార్కింగ్ చేశారన్నారు. తరతరాలుగా నివసిస్తున్న తమ సెంటిమెంట్‌ను జీవీఎంసీ అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై తాము ఇప్పటికే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, వార్డు కార్పొరేటర్లకు వినతిపత్రాలు అందజేశామని అన్నారు. ఇందుకు స్పందించిన సాధిక్ మాట్లాడుతూ ఈ విషయమై తాను జీవీఎంసీ అధికారులతో మాట్లాడతానని, కౌన్సిల్ సమావేశంలో కూడా ప్రజల ఇబ్బందులను ప్రస్తావిస్తానని స్పష్టం చేశారు. వార్డు ప్రజలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

దేవీ నవరాత్రులకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న మన్యాల శ్రీనివాస్, ఆటోస్టాండ్ కార్మికులు

దాబాగార్డెన్స్ : నగరంలోని 29వ వార్డు కలెక్టర్ కార్యాలయ జంక్షన్‌లో రావిదుర్గ గణపతి సాయి షణ్ముఖ ప్రసన్న ఆంజనేయ ఆటోస్టాండ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీ నవరాత్రుల ఉత్సవాల పందిరి రాట శుక్రవారం వేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆటోస్టాండ్ యూనియన్ సభ్యులు కట్ట శ్రీను, గొలగాని శ్రీను, జెరాక్స్ రమణ, దుక్క ప్రసాద్, ఎన్. శ్రీను, బి. శ్రీను, వి. మహేను, సారిపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

హాకర్స్‌కు అండగా ఎమ్మెల్యే ధర్నా



జగదాంబ జంక్షన్‌లో ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం : ఫుట్ పాత్ హాకర్స్‌కు అండగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం ధర్నా నిర్వహించారు. గత 11 రోజుల క్రితం నగర ట్రాఫిక్ పోలీసులు జగదాంబ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు గల ఫుట్‌పాత్ హాకర్స్ వద్దకు వచ్చి వ్యాపారాలు నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో వారు ఎమ్మెల్యే వాసుపల్లిని కలిసి తమ గోడు వినిపించారు. దీంతో ఆయన ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీలతో మాట్లాడినా వారి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో శుక్రవారం 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం తదితరులతో కలిసి జగదాంబ జంక్షన్‌లో ధర్నా చేపట్టారు. దీంతో పోలీసు అధికారులు స్పందించి వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతించడంతో ధర్నా విరమించారు. ఫుట్‌పాత్ హాకర్స్ ఎమ్మెల్యే వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్నాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డులో మృతి చెందిన వాడమొదుల సూకరాజు కుటుంబానికి వైఎస్సార్ బీమాను ఆ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ శుక్రవారం అందజేశారు. రూ.10 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేసి, ప్రభుత్వం నుంచి రావల్సిన మొత్తాన్ని త్వరగా వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆకుల యేసు, రెయ్యి డేవిడ్‌రాజు, కాసారపు వాసు, సత్యవతి, నిమ్మకాయల ఆదిలక్ష్మి, సారిక దైవకుమార్ ఆనంద్, డాక్టర్ రమణ, శ్రావణ్, శేఖర్, ఎల్లాజీ, రోజా, రమణి, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి



మాట్లాడుతున్న దొడ్డి బాపు ఆనంద్

తాటిచెట్లపాలెం : అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని దక్షిణ నియోజకవర్గంలోని 27,31,32,42 వార్డుల మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ అన్నారు. శుక్రవారం సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో జరిగిన వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పాటు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని దిశా నిర్దేశం చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొడ్డి రామానంద్ మాట్లాడుతూ నవంబరు నుండి ప్రతిరోజు 3 గంటల నుండి 5 గంటల వరకు సచివాలయాల్లో సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరించాలని, 5 నుండి 7 గంటల వరకు జెండా ఆవిష్కరణ, 7 నుండి 9 గంటల వరకు వార్డు పెద్దలతో రాత్రి భోజనం, బస చేయాలని తెలిపారు. మరుసటి రోజు వై ఏపీ నీడ్స్ జగన్ అనే అంశంపై ప్రజలకు వివరించాలన్నారు. 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, 27, 32 వార్డుల అధ్యక్షులు సర్వేశ్వరరెడ్డి, మూలె రామిరెడ్డి, జిల్లా సెక్రటరీ ఆళ్ల శ్రీనివాసరావు, జిలా ప్రధాన కార్యదర్శి నీలాపు రమణారెడ్డి, స్టేట్ డైరెక్టర్ ఎస్. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీకి భారత రాజ్యాంగం పుస్తకం బహూకరణ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 30వ వార్డు తాడివీధిలో గల లైబ్రరీకి భారత రాజ్యాంగం పుస్తకాన్ని విశాఖ సిటీ ఏడీసీపీ గంగాధర్ శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీల వల్ల యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని, విజ్ఞానం పెంపొందించుకుంటారని చెప్పారు. సీఐ లూథర్‌బాబు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు లైబ్రరీని ఉపయోగించుకోవాలని తెలిపారు. కోన పరమేశ్వరరావు, కోన ప్రకాష్, కుమార్, కోన శంకర్, బోని శ్రీను, సబ్బవరపు శ్రీను, తేజ, డాక్టర్ చలపతి పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యులతో ప్రమాణం చేయించారు. ముందుగా ఆయన ధర్మకర్తల మండలి సభ్యులతో కలసి వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఈవో శ్రీనివాసరావుతో కలిసి సభ్యులతో ప్రమాణం చేయించారు. సభ్యులుగా సంకాభక్తుల సన్యాసిరావు, అరుగుల రాజ్‌కుమార్, మాకిన రమణమ్మ, పెంకి కనకమహాలక్ష్మి, వాసంశెట్టి కళ్యాణి, దూడ బంగారి, తుంపల్ల చిన్న, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ అర్చకుడు కె.రామానుజాచార్యులు ప్రమాణం చేశారు. దేవస్థానం చైర్మన్‌గా సంకాభక్తుల సన్యాసిరావును ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన చరిత్ర కలిగిన పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి పాలకమండలిలో స్థానం లభించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. కనకమహాలక్ష్మీ దేవస్థానం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పాలక మండలి సభ్యులు, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పీతల వాసు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, మాజీ కార్పొరేటర్ బుద్దల అనురాధ, ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ వడ్డాది దిలీప్, 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, ఆదివిష్ణు, లండా రమణ, బోణి దేవ, త్రినాథ్, బుల్లెట్ రవి, కోరాడ సురేష్, శ్యామ్, సాగర్, సురేష్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యం కూడా అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్ : విద్యార్థులకు నైపుణ్యం చాలా ముఖ్యమని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి అభిప్రాయపడ్డారు. శుక్రవారం కళాశాల ఐక్యూఏసీ, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రాం ఫర్ పొటెన్షియల్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నైపుణ్యం ద్వారా జీవితంలో వచ్చే అనేక సమస్యలు సులభంగా పరిష్కరించుకోగలమన్నారు. అనంతరం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ స్త్రీలు తమకున్న నైపుణ్యాలను వ్యాపారంలో పెట్టుబడిగా పెడితే అద్భుతాలు సాధించగలరని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ దేవి[illegible]డ్రాజు కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, అనురాధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



అచ్చియ్యమ్మపేటలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, బోణి దేవ, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆర్థికసాయం..

జీవీఎంసీ 32వ వార్డు, అల్లిపురం రైల్వేగేటు ఎదురుగా శ్రీ విజయ దుర్గా ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే వాసుపల్లి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముందు జాగ్రత్తతో వ్యాధులు దూరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి, జెడ్సీ శివప్రసాద్ తదితరులు



సెబాస్టియన్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ కృష్ణ తదితరులు

అల్లిపురం : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె జోన్–3, కమిషనర్ శివప్రసాద్‌తో కలిసి వార్డులో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లలోని కుండీల్లో గల నీటిని రెండు రోజులకు ఒకసారి మార్చాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచించారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ మంచినీటిలో పెరిగే దోమల వలన డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రపరచుకోవాలన్నారు. నీళ్ల కుండీలు, మొక్కల కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంక్, ఫ్రిడ్జి, ట్రేలు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకుని ఎండలో ఆరబెట్టుకోవాలని సూచించారు. తద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తి నుండి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం కొబ్బరితోటలో పబ్లిక్ బావుల్లో గంబూషియా చేపలు వదిలిపెట్టారు. వీటి వలన నీటిలో దోమ లార్వాలు అంతరించిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో, బయాలజిస్ట్, వార్డు పార్టీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, వెంకాయమ్మ, మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

41వ వార్డులో..

కంచరపాలెం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సూచించారు. 41వ వార్డు జ్ఞానాపురం పరిధి బాబూకాలనీ, సెబాస్టియన్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ దోమల లార్వాల నిర్మూలనకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం వాటర్ ట్యాంకులు, ఇతర నీటి నిల్వ పాత్రలను ఎండబెట్టాలన్నారు. వార్డులో కాలువలు, డ్రైనేజీలు, తడిపొడి చెత్త సేకరణపై పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్ఎస్ఎం ప్రసాద్, మలేరియా ఎస్ఐ శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దేశాన్ని, సంస్కృతిని గౌరవించాలి

దాబాగార్డెన్స్ : భారతీయులంతా దేశాన్ని ప్రేమించి, భారతీయ సంస్కృతిని గౌరవించాలని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పిలుపునిచ్చారు. కళాశాలలో శుక్రవారం మేరా మట్టి.. మేరా దేశ్ కార్యక్రమం చేపట్టారు. దేశం కోసం అమరులైన స్వాతంత్ర్య సమరయోధులు, జవాన్లను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రముఖ పాత్ర పోషించిన సమరయోధులను, సరిహద్దుల్లో కాపలా కాసే సైనికులను ఎప్పుడూ గుర్తించుకోవాలన్నారు. మట్టిని నమ్ముకున్న రైతన్నను గౌరవించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ ఎ. అర్చన, వెంకటరత్నం, డి. గాయత్రీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్



వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద గల రాణి విగ్రహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ (ఫైల్)

జగదాంబ : నెలరోజుల కిందట జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద ఉన్న బ్రిటిష్ రాణి విగ్రహాన్ని పరిశీలించారు. ఆ విగ్రహంతో పాటు ఆ ప్రాంతమంతా అభివృద్ధి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే కింది స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో కమిషనర్ ఆదేశాలు ఆచరణకు నోచుకోలేదు. రాణి విగ్రహం, చుట్టుపక్కల ప్రాంతం అంతా అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. మందుబాబులు విగ్రహం పరిసరాల్లో కూర్చుని మద్యం సేవిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పాతనగరవాసులు కోరుతున్నారు.

అలరించిన ఆధ్యాత్మిక సంకీర్తనలు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన ఆధ్యాత్మిక సంకీర్తన కార్యక్రమం అలరించింది. పి.లక్ష్మీనాయుడు శిష్య బృందం పాడిన వనమాలి అమృత వరదాయని భక్తులను ఆకట్టుకుంది. చందమవన్నె కాగడగణనాది, అడకనే వరాలిచ్చే, ఏపేరుతో నిను పిలిచినా, శరణు శరణు, ఇంద్రకీలాద్రిపై, చూడ రమ్మ సతులాల, వేడుకొందామా, చక్కని తల్లికి పిల్లలు కీర్తనలు మృదుమధురంగా ఆలపించారు. వీరికి కె.శ్రీరామ్ శ్రీనివాస్ వయోలిన్‌పై, ఆర్.శ్రీచరణ్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. గాయకులు మనోజ్ఞ, అభిష్ణు, షైవి, హంసిక, సాన్విక, ఇషితలను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించి అభినందించారు.

కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



రొమ్ము క్యాన్సర్ అవగాహన సదస్సులో కేజీహెచ్ వైద్యాధికారులు

దొండపర్తి: రొమ్ము క్యాన్సర్‌పై కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్ అంకాలజీ విభాగంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా రేడియోథెరపీ విభాగం 50 మందికి స్క్రీనింగ్ పరీక్ష చేసి క్యాన్సర్‌కు సంబంధించిన కారణాలు, ముందస్తు నిర్ధారణ, చికిత్స విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో రోగులకు పళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, అంకాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శిల్ప, రేడియోథెరపీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ పాండురంగకుమారి, ఏఆర్ఎంఓ డాక్టర్ గుడురి సీతామహాలక్ష్మి, ఇతర ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.